
సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



బాణసంచా వెలుగులు






బాంబులు జారవిడుస్తూ దూసుకుపోతున్న యుద్ధ విమానాలు

సరిలేరు... మీకెవ్వరూ..





ఉగ్రవాదులపై దాడి చేస్తూ..

- భారత శక్తి, సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పిన నౌకాదళం
- అద్భుతంగా సాగిన మిలాన్ ఇంటర్నేషనల్ సిటీ పరేడ్
- జనసంద్రమైన ఆర్కే బీచ్
- ముఖ్య అతిథిగా రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ హాజరు
- గౌరవ అతిథులుగా నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: సముద్రాన్ని చీల్చుకుంటూ దూసుకొచ్చిన హైస్పీడ్ బోట్లు.. వినీలాకాశంలో చక్కర్లు కొడుతూ దివి నుంచి సాగర జలాల్లోకి త్రివర్ణ పతాకంతో దిగివచ్చిన స్కై డైవర్లు.. శత్రు స్థావరాలపై మెరైన్ కమాండోల మెరుపు దాడులు.. గాలికంటే వేగంగా దూసుకొచ్చి బాంబుల వర్షం కురిపించిన యుద్ధ విమానాలు.. జెట్ స్పీడ్‌తో ఒడ్డుకు చేరుకున్న జెమినీ బోట్లు.. సముద్రంలో చిక్కుకున్న వారిని సాహసోపేతంగా రక్షించిన కమాండోలు.. ఒకటి కాదు.. రెండు కాదు.. కళ్లు చెదిరే విన్యాసాలతో ఆర్కే బీచ్‌లో కదన రంగ వాతావరణం కనిపించింది. ప్రతిష్టాత్మక మిలాన్– 2024 వేడుకల్లో ముఖ్య భాగమైన హార్బర్ ఫేజ్ ఆపరేషనల్ డెమో, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ అద్భుతంగా సాగింది. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ పాల్గొన్న ఈ వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. గురువారం సాయంత్రం 5 గంటలకు ముఖ్య అతిథులు వేదికపైకి చేరుకుని.. ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు.



రక్షణశాఖ సహాయ మంత్రికి జ్ఞాపిక బహూకరిస్తున్న వైస్ అడ్మిరల్ హరికుమార్

తూర్పు తీరం ఎంతటి శత్రుదుర్భేద్యమో.. సుశిక్షితులైన సిబ్బంది తమ యుద్ధ విన్యాస ప్రదర్శనలతో ప్రపంచానికి చాటిచెప్పారు. ఇండియన్ నేవీతో పాటు 51 దేశాల నౌకాదళ, రక్షణదళ శక్తి సామర్థ్యాలను ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం నగరవాసులకు మరోసారి దక్కింది. ఈ అద్భుతమైన విన్యాసాలు భారత నౌకాదళ శక్తి, సామర్థ్యాలను చాటిచెప్పాయి.



సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న కమాండోలు





సరదాగా ఫొటోలు తీసుకుంటున్న విదేశీ నావికాదళ అధికారులు



గాల్లో సాహస విన్యాసం





విన్యాసాలు తిలకిస్తున్న నగర ప్రజలు

తీరంలో జాతర

బీచ్‌రోడ్డు: మిలాన్ 2024లో భాగంగా హార్బర్ ఫేజ్ ఆపరేషనల్ డెమో ప్రదర్శన, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌ను చూసేందుకు నగరవాసులు తీరానికి తరలివచ్చారు. లక్షల సంఖ్యలో రావడంతో.. తీరంలో జాతర వాతావరణం నెలకొంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో ఇసుకవేస్తే రాలనంత జనం కనిపించారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎల్‌ఈడీ స్క్రీన్లు, స్పీకర్లు ఏర్పాటు చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్, నేవీ చీఫ్ అడ్మిరల్ హరికుమార్, మంత్రి అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరికుమారి, కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, నావికాదళ అధికారులు



విన్యాసాలు వీక్షిస్తున్న నేవీ సిబ్బంది కుటుంబ సభ్యులు



జెమినీ బోట్లపై తీరం వైపు దూసుకొస్తున్న మార్కోస్‌లు

పటిష్ట ఏర్పాట్లతో విజయవంతం

లక్షలాది మంది విన్యాసాలు చూసేందుకు వస్తారని అంచనా వేసిన అధికారులు అందుకు తగ్గట్లుగా భారీ ఏర్పాట్లు చేశారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్యాలరీలు ఏర్పాటు చేయడంతో పాటు మరుగుదొడ్లు, మంచి నీటి సదుపాయాలు కల్పించారు. ప్రతీ గ్యాలరీ వద్ద పోలీసులను ఏర్పాటు చేసి ప్రేక్షకులను నియంత్రించారు. విన్యాసాలు ముగిసిన అనంతరం ఎక్కడికక్కడ దారి మళ్లించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. అలాగే ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు ఐదు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.

విన్యాసాలు సాగాయిలా..

- ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఆర్.కె.బీచ్ పరిసరాలకు చేరుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- ఐఎన్ఎస్ డేగా కమాండర్ సందీప్ నేతృత్వంలో ఐదు హాక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లపై కమాండోలు బాంబ్ పేలుడు, వ్యూహాత్మక విన్యాసాలతో కూడిన ఎయిర్ పవర్ ప్రదర్శన చేశారు.
- కమాండర్ అశితోష్ బోబ్డే నేతృత్వంలో హాక్ విమానాలు 400 నాటికల్ మైళ్ల వేగంతో సాగర జలాలకు అతికొద్ది ఎత్తులో.. గాల్లో చక్కర్లు కొడుతూ దూసుకుపోయాయి.
- కమాండర్లు అశీష్ కోరే, శ్యామ్ సాగర్ నేతృత్వంలో రెండు హాక్ జెట్లపై కమాండోలు సముద్రానికి తక్కువ ఎత్తులో.. విన్యాసాలు ప్రదర్శించి అబ్బుర పరిచారు.
- కమాండర్ అర్చేష్ నాయకత్వంలో ఆరు చేతక్‌లపై సైనికులు అతిథులకు అభివాదం చేసేలా విన్యాసాలు చేశారు.
- మూడు భిన్నమైన హెలికాప్టర్లపై విభిన్న పద్ధతుల్లో సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించే ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. చేతక్ హెలికాప్టర్ సింగిల్ లిఫ్ట్‌లో, ఏఎల్‌హెచ్ డబుల్ లిఫ్ట్‌లో, యూహెచ్ 3 హెచ్ ద్వారా రెస్క్యూ బాస్కెట్ ద్వారా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి.
- సీహాక్స్ హెలికాప్టర్లు తొలిసారిగా విశాఖ ప్రజలను అలరించాయి. రోమియోలుగా చెప్పుకునే ఈ హెలికాప్టర్లు బాణసంచా వెలుగులతో కొత్త అనుభూతిని పంచాయి.
- మార్కోస్‌లుగా పిలిచే మెరైన్ కమాండోలతో జెమినీ బోటు సముద్రంలో ఉండగా.. రెండు చేతక్ హెలికాప్టర్ల పై నుంచి మరి కొందరు మార్కోస్‌లు బోటులోకి సాహసోపేతంగా చేరుకున్నారు. ఈ విన్యాసాలకు కమాండర్ కౌశల్ బెనర్జీ నాయకత్వం వహించారు.



విద్యుత్ వెలుగుల్లో ప్రధాన వేదిక

- నాలుగు జెమినీ బోట్లు నుంచి కమాండర్లు లక్ష్యసాధన వైపు సాగుతూ దాడికి హెచ్చరికగా ఆరెంజ్ పొగను విడిచిపెట్టి.. తీరం వైపు సాగారు. ఒడ్డున తీవ్రవాదుల చేతిలో చిక్కుకున్న వ్యక్తిని రక్షించి.. వారిని మట్టుబెట్టారు.
- రెండు లైట్ స్ట్రైక్ వెహికల్స్‌లో మార్కోస్ చేరుకుని తీవ్రవాద స్థావరాలపై దాడులు చేశారు. ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు.



త్రివర్ణంలో బాంబుల మోత

- ఐఎన్ఎస్ కర్ణ్‌కు చెందిన మార్కోస్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్(ఏఎల్‌హెచ్) నుంచి పారా సెయిలింగ్ కోసం 8 వేల అడుగుల ఎత్తు నుంచి ఐదుగురు సాహస దళ సభ్యులు పారాచూట్ సాయంతో దూకారు.
- పారాడోర్నియర్ పీకే బస్తోలా ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకంతో పాటు భారత నౌకాదళ పతాకాన్ని చేతపట్టుకుని 8 వేల అడుగుల ఎత్తు నుంచి ఆక్సిజన్ మాస్క్ సాయంతో దూకారు. మెరైన్ కమాండో పారాచూట్ సాయంతో కిందికి దిగి.. ముఖ్య అతిథి రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్‌కు జ్ఞాపిక అందించారు.
- సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించిన ప్రదర్శన ఒళ్లు గగుర్పొడిచింది. సీకింగ్స్ హెలికాప్టర్ మెరైన్ కమాండోలను జెమినీ బోట్లలోకి దించింది. మళ్లీ వచ్చి వారిని తీసుకువెళ్లి.. సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా మార్కోస్ త్రివర్ణ పతాకాన్ని, నౌకాదళ పతాకాన్ని చేతబూని సముద్ర ఉపరితలంపై ప్రదర్శించారు. కమాండర్ యువ్ రాజ్‌కుమార్ నేతృత్వంలో ఈ ప్రదర్శన విజయవంతంగా సాగింది.
- కమాండర్ రాజీవ్ ప్రసన్న నేతృత్వంలో భారత నౌకాదళానికి చెందిన అత్యంత వేగవంతమైన మిగ్–29కే యుద్ధ విమానాలు స్మాల్ షిప్స్ బాంబులు పేలుస్తూ సముద్ర జలాల్లో దూసుకుపోయాయి. గాల్లో చక్కర్లు కొడుతూ ఏరోడైనమిక్స్ విన్యాసాలతో అందర్నీ అలరించాయి. మూడు మిగ్ 29 యుద్ధ విమానాలు ఒక్కసారిగా దూసుకొచ్చి.. బాంబుల వర్షం కురిపించాయి.
- కమాండర్ బస్సీదర్‌యాదవ్ నేతృత్వంలో జాతీయ పతాకాన్ని, నౌకాదళ పతాకాన్ని ఆవిష్కరించేలా.. నాలుగు చేతక్ హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ఎగురుతూ బ్యానర్ ఫార్మేషన్‌లో ఆకట్టుకున్నాయి.
- మరో 3 చేతక్‌లతో గరుడ ఫార్మేషన్‌తోనూ, ఫాల్కన్ ఫార్మేషన్, ఏంజిల్ ఫార్మేషన్, ల్యాన్సర్, సారస్, ఈగల్, ఫార్మేషన్స్‌తో మొత్తం 54 హెలికాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్స్ అలరించాయి. కమాండర్ అభినవ్ భాండా ఆధ్వర్యంలో 4 డార్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్ కై ట్ ఫార్మేషన్స్ దూసుకొస్తూ చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి.
- పీ 81 ఎయిర్ క్రాఫ్ట్‌కు ఇరువైపులా రెండు మిగ్–29 ఎయిర్‌క్రాఫ్ట్‌లు టాల్ బాయ్ ఫార్మేషన్‌లో 900 కి.మీ వేగంతో దూసుకెళ్తూ బాంబుల వర్షం కురిపించాయి.
- కమాండర్ ఆశుతోష్ నేతృత్వంలో ఏడు హాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్స్ పాంథమ్ ఫార్మేషన్‌లో గాలితో దూసుకెళ్లాయి.
- డీకే ధాండేకర్ నాయకత్వంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తేజస్ యుద్ధ విమానాల విన్యాసాలు ప్రదర్శించారు.
- ఐదు మిగ్ విమానాలతో ఫ్లై పాస్ట్ నిర్వహించారు. అనంతరం సన్‌సెట్ సెర్మనీ జరిగింది. జాతీయ జెండాతో పాటు నౌకాదళ పతాకాలను అవతనం చేశారు.
- భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ జలశ్వా, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, ఐఎన్ఎస్ చెన్నై యుద్ధ నౌకలు విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోయాయి.

యుద్ధ విన్యాసాలను తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ తదితరులు వీక్షించారు.

నేడు విశాఖకు గొల్ల బాబూరావు

- రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తొలిసారి నగరానికి..
- ఎయిర్‌పోర్టులో స్వాగతం పలకనున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



సాక్షి, విశాఖపట్నం : రాజ్యసభ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన గొల్ల బాబూరావు శుక్రవారం విశాఖకు రానున్నారు. ఉదయం 8.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయనకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలకనున్నాయి. ఎయిర్‌పోర్టు నుంచి వందలాది బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్లి డాబాగార్డెన్స్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించనున్నారు. అక్కడ నుంచి బీచ్‌రోడ్డుకు చేరుకొని అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం సీతమ్మధారలోని ఇంటికి వెళ్తారు.

మహాశివరాత్రి కోసం భారీ ఏర్పాట్లు

దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ శిరీష

మహారాణిపేట: వచ్చేనెల 8వ తేదీన జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష ఆదేశించారు. గురువారం టర్నర్ సత్రం ఆవరణలో దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో పలు దేవాలయాల ఈవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహాశివరాత్రి రోజున ఐదు వేల మంది భక్తులు వచ్చే దేవాలయాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఆ రోజు భక్తులకు ఉచిత ప్రసాదం, తాగునీరు తదితర వాటిని సరఫరా చేయాలన్నారు. అలాగే అన్ని దేవాలయాల వద్ద షామియానాలు, లైటింగ్, క్యూలైన్లు, తాత్కాలిక స్నానపు గదులు, తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఉన్న శైవ దేవాలయాల వద్ద జాగ్రత్తలు వహించాలన్నారు. సముద్ర స్నానాల ఘాట్‌ల వద్ద గజ ఈత గాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. 16 దేవాలయాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సమావేశంలో ఈవోలు పిఎస్ఎన్ మూర్తి, బి.ఎల్.నగేష్, నీలిమ, కె.పద్మావతి, టి.రాజగోపాలరెడ్డి, పి.ఎల్ఎన్‌రాజు, నానాజీ, కె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, జగన్నాధం, గాయత్రి, బండారు ప్రసాద్, పి.శేఖర్‌బాబు, ఎస్.ప్రసన్నలక్ష్మి, ఏ.దేముళ్లు(మేనేజర్), తనిఖీదారుడు బి.వసంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జూలో బ్యాటరీ సైకిళ్లు ప్రారంభం



సైకిళ్లను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో బ్యాటరీ సైకిళ్లు అందుబాటులోకి వచ్చాయి. వాటిని సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి జూ క్యూరేటర్ నందనీ సలారియాతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాటరీతో నడిచే 10 సైకిళ్లను అందుబాటులో ఉన్నాయన్నారు. మరో 10 సైకిళ్లు త్వరలో తీసుకురానున్నట్లు తెలిపారు. ఇవి జూ ప్రధాన ద్వారంతో పాటు సాగర్ గేటు వద్ద సందర్శకుల కోసం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఆసక్తి గల సందర్శకులు సైకిల్‌కు గంటకు రూ.70 చొప్పున చెల్లించి జూ లోపల తిరగవచ్చన్నారు. ఇది బ్యాటరీతో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో జూ డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

విశాఖలీగల్: రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం విశాఖ వస్తున్నారు. శుక్రవారం ఉదయం మహిళా న్యాయవాదులు సమాఖ్య నిర్వహించే కార్యక్రమంలో న్యాయమూర్తి ప్రధాన ప్రసంగం చేస్తారు. అనంతరం బొబ్బిలి వెళ్తారు.


బాణసంచా వెలుగుల మధ్య విద్యుత్ కాంతులతో యుద్ధనౌకలు



అలరించిన పులివేషాలు, కాళికా నృత్యాలు

స్నేహానికి వారధి.. సాంస్కృతిక సారథి

మిలాన్–2024 విన్యాసాలకు మరింత సొగసు తెచ్చేలా.. అంతర్జాతీయ సిటీ పరేడ్‌ను కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ ప్రారంభించారు. వివిధ దేశాలకు చెందిన నౌకాదళాలు, కోస్ట్‌గార్డ్ బృందాలు నిర్వహించిన కవాతు ఈ కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచింది. రాష్ట్రానికి చెందిన కళలకు సిటీ పరేడ్‌లో పెద్దపీట వేశారు.


సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా నెమలి వేషధారణలో బాలిక


సంప్రదాయ వస్త్రధారణలో విదేశీ సైనికుడు


అద్భుతంగా సాగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


ఆకట్టుకున్న జీవీఎంసీ శకటం




కవాతు చేస్తున్న విదేశీ నావికా దళాలు


విదేశీయులను ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన

సిటీ పరేడ్ సాగిందిలా..

- 205 మంది విశాఖ నేవీ చిల్డ్రన్ స్కూల్ విద్యార్థులు 'కలర్స్ ఆఫ్ లైఫ్' నృత్య ప్రదర్శనతో పరేడ్ ప్రారంభమైంది.
- యుద్ధ నౌకల్లో ప్రదర్శించే హార్న్‌పైప్ డ్యాన్స్ ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. 55 మంది సీ క్యాడెట్ కార్ప్స్ నృత్య ప్రదర్శనతో అదరగొట్టారు.
- కమాండర్ హైకమ్ బిక్ నాయకత్వంలో 51 దేశాల జాతీయ పతాకాలను ప్రదర్శిస్తూ నేవీ బ్యాండ్ ప్రదర్శన అలరించింది.
- నేవీ బ్యాండ్ మాస్టర్ ఆంథోనీ రాజ్ నేవల్ బ్రాస్ బెండ్ ఉర్రూతలూగించింది.
- ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ దళాల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్మీ బ్యాండ్ అదరగొట్టింది.
- సీనియర్ క్యాడెట్ మొబీన్ నేతృత్వంలో సీ క్యాడెట్ కార్ప్స్, ఎయిర్‌ఫోర్స్ బ్యాండ్, ఎన్‌సీసీ మార్చ్ నిర్వహించాయి.
- క్యాడెట్ సాయిసందీప్ ఆధ్వర్యంలో కోరుకొండ సైనిక్ స్కూల్ దళం కవాతు చేసింది.
- ఏపీ పోలీస్ దళం, ప్రత్యేక పోలీసు, ఆక్టోపస్, ఏపీ స్టేషన్ ఫైర్ సర్వీసెస్ బలగాలు మార్చ్‌పాస్ట్ చేశాయి.
- లెఫ్టినెంట్ షమిత్ నేతృత్వంలో 25 మంది బంగ్లాదేశ్ నౌకాదళం మార్చ్‌పాస్ట్ చేసింది.
- చీఫ్ ఆఫీసర్ పాల్‌రాజ్ నేతృత్వంలో ఐఎన్ఎస్ చిలకా నేవల్ బ్యాండ్ ఆకట్టుకుంది.
- ఆ తర్వాత వరసగా ఫ్రాన్స్, ఇండోనేషియా, ఇరాన్ దేశాలు తమ బ్యాండ్ బృందాలతో పరేడ్ నిర్వహించాయి.
- 25 మందిమలేషియన్ నేవీ బృందం కవాతు చేసింది.
- మారిషస్, మయన్మార్, రష్యా నేవీ బృందాలు తమదైన శైలిలో కవాతు చేశాయి.
- ఆఫ్రికాలో అతి చిన్న దేశమైన సీషెల్స్‌కు చెందిన కోస్ట్ గార్డ్ బృందం కవాతు ఆకట్టుకుంది.


పరేడ్‌లో పాల్గొన్న విదేశీ నావికాదళ సభ్యులు

- లెఫ్టినెంట్ అలకరంజే సచిత్, కోయిల్ షమితా నేతృత్వంలో శ్రీలంక నేవీ బృందం మూడు విభిన్న సంప్రదాయ నృత్యాలు, బ్యాండ్‌తో అలరించింది.
- రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే గరగలు డ్యాన్స్ విదేశీ ప్రతినిధులను ఆకట్టుకుంది.
- కూచిపూడి, థింసా నృత్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. కొమ్ముకోయ గిరిజన నృత్య ప్రదర్శనకు విదేశీయులు ఫిదా అయ్యారు.
- దాండియా, గార్బా, డప్పు నృత్యం, పులివేషం, అమ్మవారి వేషాలు, కోలాటాలు, తప్పెటగుళ్ల తదితర ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి.
- పరేడ్ అనంతరం శకటాల ప్రదర్శన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన నవరత్నాల శకటం సిటీ పరేడ్‌కు హైలైట్‌గా మారింది. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులు, భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రాజెక్టుల నమూనాలు, సిటీ ఆఫ్ డెస్టినీ శకటాలు ఆకట్టుకున్నాయి.
- శరత్‌కుమార్ ఆధ్వర్యంలో బ్యాండ్ ప్రదర్శన అలరించింది.
- నేవీ బ్యాండ్ ప్రదర్శనతో సిటీ పరేడ్ ముగిసింది.
- చివరగా లేజర్ షో అదరహో అనిపించింది.

లలితాదేవికి బంగారు చీర అలంకరణ

సీతంపేట: శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం సందర్భంగా లలితాదేవి అమ్మవారికి 2 కిలోల బంగారంతో చీర చేయించారు. కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా బంగారు చీరను ఆవిష్కరించి, అమ్మవారికి అలంకరించారు. భక్తులు, దాతల సహకారంతో అమ్మవారికి బంగారు చీర చేయించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని, కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ, చిట్టిబాబు పాల్గొన్నారు.



నవ్యాంధ్ర లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

విశాఖలీగల్: నవ్యాంధ్ర లాయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక గురువారం జిల్లా కోర్టులోని న్యాయవాదుల ఆడిటోరియంలో జరిగింది. అసోసియేషన్ ఫౌండర్ కొయ్య హరిహర్‌రెడ్డి అధ్యక్షుడిగా, బగాది తులసీదాస్ ప్రధాన కార్యదర్శిగా, అప్పలనాయుడు ఉపాధ్యక్షుడిగా, జి.రామిరెడ్డి సంయుక్త కార్యదర్శిగా, జి.ఎల్.కుమార్ కోశాధికారిగాను, 9 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గానికి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ కార్యవర్గం మూడేళ్ల కాలపరిమితిగా కొనసాగుతుంది.

విశాఖలో మరోసారి ఐపీఎల్

- తొలి విడత రెండు మ్యాచ్‌లకు అవకాశం
- మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్
- ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్‌తో కోల్‌కతా రైడర్స్
- ఐదో జట్టుకు హోమ్‌గ్రౌండ్‌గా వైఎస్సార్ స్టేడియం



విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియం మరోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఇప్పటికే నాలుగు జట్లకు హోమ్ గ్రౌండ్‌గా నిలిచిన ఈ స్టేడియం ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్‌కు హోమ్ గ్రౌండ్‌గా నిలవనుంది. ప్రస్తుత 17వ ఐపీఎల్ సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగనున్న చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ విశాఖ వేదికగా జరగనుంది. మరో 38 రోజుల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ప్రత్యక్షంగా వీక్షించేందుకు నగరవాసులు సిద్ధమవుతున్నారు.

రెండు మ్యాచ్‌లు విశాఖలో...

ప్రస్తుత సీజన్‌లో తొలి విడతలో 21 మ్యాచ్‌లు 10 నగరాల్లో రెండు వారాలపాటు జరగనుండగా అందులో రెండు మ్యాచ్‌లు విశాఖలోనే నిర్వహించేందుకు బీసీసీఐ షెడ్యూలు ఖరారు చేసింది. 2019లో గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏకంగా రెండు ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్‌లను విశాఖ సొంతం చేసుకోగా.. మళ్లీ ఇప్పుడు మరో రెండు మ్యాచ్‌లకు అతిథ్యమివ్వనుంది. హోమ్ గ్రౌండ్‌గా వైఎస్సార్ స్టేడియాన్ని తొలిసారిగా 2012లో డెక్కన్ చార్జర్స్ ఎంచుకోగా 2015లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఎంచుకుంది. 2016లో ముంబయ్ ఇండియన్స్, పూణే సూపర్ జెయింట్స్ జట్లు ఏకంగా మూడేసి మ్యాచ్‌లు ఆడాయి. ప్రస్తుత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 13వ మ్యాచ్‌గా మార్చి 31న చెన్నై సూపర్‌కింగ్స్‌తోనూ, 16వ మ్యాచ్‌గా ఏప్రిల్ 3వ తేదీన కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది.

సీఎం జగన్ ప్రోత్సాహంతోనే..

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌బిన్నీ, కార్యదర్శి జైషా, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ సహకారం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం వల్లే విశాఖలో రెండు ఐపీఎల్ మ్యాచ్ నిర్వహణకు అవకాశం దక్కిందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి, కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రపంచ స్థాయి వసతులను అందించడంతో విశాఖవాసులకు దక్కిన అదృష్టంగా భావించవచ్చని పేర్కొన్నారు. విశాఖలో క్రీడలకు ఎంతగానే ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

విశాఖకు ధోని

ఐపీఎల్–2016 సీజన్‌లో విశాఖలో జరిగిన 53వ మ్యాచ్‌లో పూణే సూపర్‌జెయింట్స్ జట్టు ఆట చివరి బంతిని ధోనీ బౌండరీ దాటించి నాలుగు వికెట్ల తేడాతో విజయతీరానికి చేర్చాడు. అప్పట్లో సీఎస్‌కే జట్టుకు ఐపీఎల్ అనర్హత వేటు పడగా ధోని సూపర్‌జెయింట్స్ తరపున ఆడాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కింగ్స్ పంజాబ్ ఎలెవెన్ ఏడు వికెట్లకు 172 పరుగులు చేయగా ధోని సేన భారీ లక్ష్యఛేదనలో ఆరు వికెట్లు కోల్పోయి చివరి బంతికి విజయాన్నందుకుంది. 30 బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన ధోని 64పరుగులతో ఫినిషర్‌గా నిలిచాడు. మరోసారి ధోని ప్రత్యక్ష ఆటను చూసేందుకు విశాఖ తహతహలాడుతోంది.

ఉపరాష్ట్రపతి, గవర్నర్‌కు వీడ్కోలు





ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, నేవీ అధికారులు

గోపాలపట్నం: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌లకు విశాఖ విమానాశ్రయంలో నేవీ, జిల్లా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. మిలాన్ 2024లో పాల్గొని ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.42 గంటలకు ఢిల్లీకి తిరుగుపయనమైన ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, తూర్పు నావికాదళ అధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే గణబాబు, పోలీస్ కమిషనర్ రవిశంకర్, నేవీ కమాండోర్ దిలీప్ సింగ్, చీఫ్ స్టాఫ్ సమీర్ సక్సేనా, ఆర్‌డీఓ హుస్సేన్ సాహేబ్ వీడ్కోలు పలికారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ రాత్రి 8.45 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఆయనకు జిల్లా ఉన్నతాధికారులు వీడ్కోలు పలికారు. అలాగే ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10.22 గంటలకు విశాఖ చేరుకున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, తూర్పు నావికాదళాధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెండార్కర్, ఎంపీ గొడ్డేటి మాధవి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, అడిషనల్ డీజీ(గ్రేహౌండ్స్) ఆర్.కె.మీనా, పోలీస్ కమిషనర్ రవిశంకర్ స్వాగతం పలికారు.

వైఎస్సార్ సీపీలోకి జాలరిపేట యువత


పార్టీలో చేరిన యువతతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటకు చెందిన 100 మందికి పైగా యువత ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. లాసన్స్ బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో గురువారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇన్నాళ్లు టీడీపీలో కొనసాగిన వీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజారంజక పాలనకు ఆకర్షితులు కావడంతో పాటు తూర్పు సమన్వయకర్తగా ఎంపీ ఎంవీవీ సమర్థ నాయకత్వంపై ప్రభావితులై వైఎస్సార్ సీపీలోకి చేరినట్లు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అఖండ విజయానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వారికి సూచించారు. పలువురు 19వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

24న పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

ఏయూక్యాంపస్: ఉమ్మడి విశాఖ జిల్లా పురుషుల కబడ్డీ జట్ల ఎంపిక ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు విశాఖపట్నం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.ఎస్.వి ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పెదగంట్యాడ మండలం నడుపూరు హైస్కూల్ ప్రాంగణంలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొనవచ్చన్నారు. పురుషుల బరువు 85 కేజీల లోపు ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు వచ్చేనెల 3 నుంచి 5 వ తేదీ వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగే 70వ సీనియర్ అంతర్ జిల్లాల పురుషుల ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ పోటీలలో విశాఖ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. వివరాలకు 9666655355, 8008485344 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విశాఖ మార్కెట్‌లోకి 'ఎల్‌జీ వాష్ టవర్'

సీతంపేట: ప్రముఖ గృహ ఉపకరణాల సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తమ నూతన ఉత్పత్తి 'ఎల్‌జీ వాష్ టవర్'ను విశాఖ మార్కెట్‌లోకి విడుదల చేసింది. శంకరమఠం రోడ్‌లోని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ షోరూంలో గురువారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హోంగ్ జు జియోన్ చేతుల మీదుగా వాష్ టవర్‌ను ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాండ్రి రంగంలో ఎల్‌జీ వాష్ టవర్ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందన్నారు. ఈ వాషింగ్ మెషీన్ ఏఐ ఆధారంగా పనిచేస్తుందని, కేవలం గంటలో 12 కిలోల దుస్తులను శుభ్రం చేసి డ్రై చేస్తుందన్నారు. ఈ వాష్ టవర్ ఆకృతి ఇంటి లోపల స్థలాన్ని ఆదా చేయడమే కాకుండా.. దుస్తుల తీరును బట్టి ఆటోమేటిక్‌గా ప్రోగ్రామ్ మార్పు చేసుకుంటుందన్నారు. ఇందులో టర్బో వాష్ 360, అలెర్జీ, స్టీమ్ ఫీచర్స్ దుస్తుల నాణ్యతను ఏమాత్రం తగ్గించకుండా ఎక్కువ కాలం మన్నేలా చేస్తాయన్నారు. ఈ వాష్ టవర్ ధర రూ.2,75,000గా నిర్ణయించామన్నారు. సంస్థ రీజనల్ హెడ్ కృష్ణాజీ, బ్రాంచి మేనేజర్ యుగంధర్, బ్రాండ్ షాప్ హెడ్ తరుణ్ భరద్వాజ్, ఎల్‌జీ డీలర్ సందీప్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎల్‌జీ వాష్ టవర్‌ను ఆవిష్కరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ హోంగ్ జు జియోన్

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కరుణాకర్

విశాఖ విద్య: ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షునిగా సిహెచ్.కరుణాకరరావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గం ఈ విషయాన్ని ప్రకటించింది. గత 20 ఏళ్లగా యూనియన్‌లో వివిధ హోదాల్లో పనిచేసి, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేశారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు, సీపీఎస్ రద్దు, ఇతర అలవెన్సులు, పీఆర్సీ బకాయిలు, ఎరియర్స్ విడుదల విషయంలో సంఘం రాష్ట్ర బాధ్యుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని భవిత కేంద్రాల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు అర్హులైన ఫిజియోథెరపిస్టులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా గల సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.